ఇసుక బుకింగ్‌కు విశేష స్పందన

కర్నూలు(అర్బన్), ఆగస్టు 28: ఇసుక పంపిణీ కోసం ఏర్పాటు చేసిన బుకింగ్ సెంటర్లకు విశేష స్పందన వచ్చిందని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గనుల శాఖ కార్యాలయంలో 2,275 టన్నుల ఇసుక కోసం 115 బుకింగ్స్, సి. బెళగల్‌లో 1034 టన్నుల ఇసుక కోసం 80 బుకింగ్స్ వచ్చాయని తెలిపారు. ఇందు కోసం 150 టిప్పర్లు, 45 ట్రాక్టర్ల ద్వారా గురువారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బుకింగ్ చేసుకున్న లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ బుకింగ్ ప్రక్రియను సెప్టెంబరు 11 నుంచి అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

మట్టి దొంగలు!

నంద్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):

'కర్నూలు, కడప జిల్లాల్లో ప్రవహిస్తున్న కుందూ నదిని వెడల్పు చేసి రైతులకు మేలు చేస్తాం' ఇదీ గత ప్రభుత్వం చెప్పిన మాటలు. కానీ కుందూ విస్తరణ కాంట్రాక్టర్లు, తమ పార్టీ నేతల జేబులు నింపేందుకు చేపట్టిన పనులు రాజకీయ వ్యవహారమని క్షేత్రస్థాయి పరిశీలన చూస్తే ఇట్టే అర్థమవుతుంది. కుందూ విస్తరణలో భాగంగా తవ్విన మట్టిని కట్ట బలోపేతం కోసం ఉపయోగించాల్సి ఉండగా, వైసీపీ నేతలు ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇందుకు అధికారులు కూడా పరోక్షంగా సహకరించారని అప్పట్లో బలంగానే ఆరోపణలు వచ్చాయి. కుందూ విస్తరణ జరిగిన ప్రాంతాల్లో తవ్విన మట్టి గురించి ఇటీవల అధికారులు ఆరా తీశారు. తవ్విన మట్టి కడప జిల్లాలోని కుందూ పరివాహక ప్రాంతాల్లో 60 శాతం కనిపించకపోగా, నంద్యాల జిల్లాలో 80 నుంచి 90 శాతం కనిపించడం లేదని తెలుస్తోంది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు సాగించిన కుందూ అక్రమాలపై ఆరా తీస్తే అసలు విషయాలు బయటకు వస్తాయన్న అభిప్రాయం వినిపిస్తోంది.

- వైసీపీ నేతల జేబులు నింపిన కుందూ విస్తరణ
- మట్టి తవ్వకాల్లో అవినీతి కంపు
- కట్టకు ఉపయోగించాల్సిన మట్టి ఏదీ?
- టిప్పర్లు, ట్రాక్టర్ల లెక్కన అమ్ముకున్న వైసీపీ నాయకులు
- వైసీపీ వారే మోకాలడ్డు


కుందూ నది

కుందూ నది ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల్లో ప్రవహిస్తోంది. కేసీ నుంచి 35 వేల క్యూసెక్కుల నీటిని కుందూ ద్వారా తరలించేందుకు విస్తరణ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా పాములపాడు మండలం బనకచర్ల ఎస్కేప్ ఛానల్ నుంచి కడప జిల్లా వల్లూరు మండలం ఆదినిమ్మాయపల్లె వరకు 189 కి.మీ మేర కుందూ నది విస్తరణను 2021లో మొదలుపెట్టారు. ఈ కాంట్రాక్టును తమకు అనుకూలమైన వారికి రూ.1250 కోట్లకు గత ప్రభుత్వం కట్టబెట్టింది. కంట్రాక్టును దక్కించుకున్న సంస్థ నంద్యాల జిల్లాలోని నంద్యాల, పాణ్యం మండలం, కడప జిల్లాలోని రాజుపాళెం, చాపాడు మండలాల్లో విస్తరణ పనులు చేపట్టింది. కుందూ మట్టి సారవంతమైనది కాబట్టి తమ పొలాలకు ఉపయోగపడుతుందని, తరలించుకోవడానికి తమకు అనుమతులు ఇవ్వాలని రైతులు అధికారులను కోరారు. దానికి సానుకూలంగా స్పందించిన యంత్రాంగం క్యూబిక్ మీటరు మట్టిని రూ.1 చొప్పున రైతులు తరలించుకునే వెసులుబాటు కల్పించాలని అప్పటి ప్రభుత్వానికి నివేదించింది. ఇలా చేస్తే తమకు లాభం ఉండదని భావించిన వైసీపీ నేతలు దీనిని అడ్డుకునేందుకు కుట్ర పన్నారు. రైతులు మట్టి తరలించుకుపోతే.. తర్వాత నది వెంట మట్టి కట్ట నిర్మించేందుకు వేరే చోటు నుంచి మట్టి తీసుకురావాల్సి ఉంటుందని, దీనివల్ల ప్రభుత్వం పైన అదనపు భారం పడుతుందన్న సాకుతో మోకాలడ్డారు. పోనీ విస్తరణలో భాగంగా తవ్విన మట్టిని అలానే ఉంచారా? అంటే అదీ లేదు. తవ్విన మట్టిని తవ్వినట్లుగా వైసీపీ నేతలు తమ అడ్డాల్లో భారీగా డంప్ చేసుకున్నారు. ఆ తర్వాత జిల్లాల్లో వేసిన వెంచర్లకు, ఇల్లు కట్టుకునే వారి అవసరాన్ని బట్టి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. ట్రాక్టరు మట్టిని రూ.1000, టిప్పర్ మట్టిని రూ.5-7 వేల చొప్పున అమ్ముకున్నట్లు అప్పట్లోనే ఆరోపణలు బలంగా వినిపించాయి. ఇక ఈ మట్టి మాత్రమే కాకుండా కుందూ విస్తరణ పనుల్లో అక్కడక్కడా ఎర్రమట్టి కూడా బయటపడింది. ఈ మట్టి ఇటుకల తయారీకి అనువుగా ఉండటంతో బట్టీల యజమానుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉండేది. రాత్రిపూట దొంగచాటుగా ఈ మట్టిని ఒక్కో టిప్పర్‌ను రూ.11 వేల చొప్పున వైసీపీ నాయకులు ఇటుక బట్టీలకు అమ్ముకున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇలా కొన్ని కోట్ల రూపాయలను వైసీపీ నేతలు దండుకున్నారు. ఈ తతంగం అంతా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల కనుసన్నల్లో నడవటం గమనార్హం. ట్రాక్టరుకు ఇంత, టిప్పరుకు ఇంత అంటూ కమీషన్లు తీసుకుని మట్టిని వైసీపీ నేతలు యథేచ్ఛగా అమ్ముకున్నారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వం అని చెబుతూనే, వైసీపీ ప్రభుత్వం తమ నోట్లో మట్టి కొట్టిందని, అదే సమయంలో సొంత పార్టీ వారు మాత్రం మట్టి అమ్ముకునేందుకు ఎలాంటి అడ్డు చెప్పలేదని రైతులు, రైతు సంఘం నాయకులు అప్పట్లో తీవ్రం అసహనం వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం కనీసం స్పందించలేదు. ఇక కుందూ మట్టి అక్రమ తవ్వకాలపై రైతులు అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. అయితే అధికారులు అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులకు ఎదురు చెప్పే ధైర్యం లేక మిన్నకుండిపోయారు.


ఇటీవల కడప జిల్లాలో కుందూ నది మట్టి కట్టలను పరిశీలిస్తున్న అధికారులు

● లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి మాయం

కుందూ నది విస్తరణలో భాగంగా కాంట్రాక్టర్లు కడప, నంద్యాల జిల్లాల్లో దాదాపు రూ.190 కోట్ల మేర పనులు చేశారు. ఈ పనులన్నీ పూర్తిగా మట్టి తవ్వకాలకు సంబంధించినవే! ఆయా మండలాల్లో తవ్విన మట్టి దాదాపు 3.24 లక్షల క్యూబిక్ మీటర్లు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఈ మట్టి పూర్తిగా నదికి రెండు వైపులా కట్ట నిర్మించేందుకు ఉపయోగించాలి. కానీ మట్టి కుందూ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా కనిపించటం లేదని, అసలు మట్టి అంతా ఏమైందని అధికారులను రైతులు, టీడీపీ నాయకులు ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత మట్టి మాయమైన విషయాన్ని కొంతమంది కూటమి నాయకులు సీరియస్‌గా తీసుకుని ఆరా తీయటం మొదలుపెట్టారు. కట్టసరిగా లేకపోతే కుందూలో వరద వచ్చినపుడు కట్టలు తెగి పొలాలు ముంపునకు గురవుతాయని, విస్తరణలో భాగంగా తవ్విన లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి ఏమయిందో తేల్చాలని ఎన్జీటీకి ఫిర్యాదు చేశారు. ఎన్జీటీ నుంచి వచ్చిన సమాచారం మేరకు ఇటీవల కడప అధికార యంత్రాంగం కుందూ వెంట పరిశీలనలు జరిపింది. అయితే కుందూలో ప్రవాహం ఎక్కువగా ఉండటంతో మట్టి కట్టల పరిమాణాన్ని కొలవటానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, నదిలో నీటి మట్టం తగ్గిన తర్వాత పరిశీలిస్తామని చెప్పారు. ఇక నంద్యాల జిల్లాకు చెందిన అధికారులకు మాయమైన మట్టి గురించి కనీస పట్టింపు లేదు. మట్టిని ఎప్పటికపుడు తరలిస్తుంటే ఏ మాత్రం పట్టించుకోకుండా ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గతంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. దీనిని బట్టి సంబంధిత అధికారులు అప్పట్లో వైసీపీ నాయకుల సేవలో ఏ విధంగా తరించారో అర్థమవుతోంది. ప్రస్తుత ప్రభుత్వం కుందూ మట్టి దొంగలను పట్టుకుని, వారు మింగిన కోట్ల రూపాయలను కక్కించటమే కాకుండా, వైసీపీ నేతలు చేసిన దందాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వినిపిస్తోంది.

● వద్దని రైతులు మొత్తుకున్నా..



కుందూ విస్తరణను రైతులు, రైతు సంఘాల నాయకులు మొదటి నుంచి వ్యతిరేకించారు. సహజ సిద్ధమైన నదిని వెడల్పు చేసి, లోతు తవ్వితే కాలువగా మారుతుందని, దీని వల్ల కుందూ నది వెంట భూగర్భ జలాలు పడిపోతాయని, రైతులు నష్టపోతారని, అంతేకాకుండా నదిలోని జీవావరణంపై కూడా ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. కట్టల ఎత్తు పెంచటం వల్ల కుందూ నది వెంట ఉన్న 1.50 లక్షల ఎకరాల సాగు ప్రశ్నార్థకమవుతుందని, సన్న, చిన్న కారు రైతులు, డీకేటీ పట్టాలు పొందిన రైతుల జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందని అప్పటి ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ప్రభుత్వం మీద ఎలాంటి ఖర్చు మోపకుండా సొంత డబ్బులతో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు బిగించుకుని పంటలు పండించుకుంటున్న రైతులకు వైసీపీ ప్రభుత్వ తీరువల్ల కన్నీళ్లు మిగిలే అవకాశం ఉందని వాదించారు. కుందూనదిని కాలువగా మార్చి గ్రావిటీ ద్వారా సోమశిలకు నీరు తరలించుకుపోవాలన్న ఆలోచన వల్ల రాయలసీమ ప్రజలకు ముఖ్యంగా కడప, కర్నూలు జిల్లాల వారు పూర్తిగా నష్టపోతారని చెప్పింది. అయినా అప్పటి వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం రైతుల విన్నపాలను కనీసం వినేందుకు ఆసక్తి చూపలేదు. కోట్ల రూపాయలు ఖర్చు చేయించి విలువైన కుందూ మట్టిని అమ్ముకునేందుకు సహకరించింది. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం కుందూ విస్తరణ పనులను రద్దు చేయాలని, అంతేకాకుండా గతంలో వైసీపీ ప్రభుత్వం చేపట్టిన మట్టి తవ్వకాల వల్ల ఆయా ప్రాంతాల్లోని రైతుల భూములు కోతకు గురవుతున్నాయని, దీనిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

నిర్ణీత కాలంలో పనులు పూర్తి చేయండి: కలెక్టర్


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 28: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి ఎంపీడీవోలు, ఏపీడీలు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లేబర్ బడ్జెట్, వంద రోజుల పని దినాల కల్పన, హార్టికల్చర్, అవెన్యూ ప్లాంటేషన్ పనులు, సంస్థాగత ప్లాంటేషన్ పనులు, బ్లాక్ ప్లాంటేషన్ పనులు, ఫారం పాండ్స్, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనులు, పశుసంపద షెడ్లు, ట్రెంచ్ పనుల ప్రగతి లక్ష్యాలపై డ్వామా పీడీ రామచంద్రారెడ్డితో కలిసి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లస్టర్ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆత్మకూరు, జూపాడుబంగ్లా, కొత్తపల్లి, మిడుతూరు, డోన్, ప్యాపిలి, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, రుద్రవరం తదితర మండలాల్లో పేలవమైన పని తీరు కనిపిస్తోందన్నారు. ఇచ్చిన లక్ష్యాలను 15 రోజుల్లోగా పూరి చేయాలని ఆదేశించారు. ఓడీఎఫ్ సర్వేను సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో పూర్తి చేయించి మెరుగైన స్థితికి తీసుకు రావాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు.

● సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సర్వీసులు అందించాలని కలెక్టర్ రాజకుమారి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నంద్యాల మున్సిపల్ పరిధిలోని రైతునగర్ 22 వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు.

నేడు మల్లన్నకు స్వర్ణ రథోత్సవం


స్వర్ణ రథం

శ్రీశైలం, ఆగస్టు 28: శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని లోకకల్యాణార్థం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించనున్నారు. దేవస్థానం వేదిక కమిటీ సూచనతో వేకువజామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు జరిపి అనంతరం 7.30 గంటలకు ఆలయ మాడవీధులలో స్వర్ణరథోత్సవం వైభవంగా జరపనున్నారు. దేవస్థానం వైదిక కమిటీ సూచన మేరకు లోకకల్యాణార్థం ప్రతీమాసం ఆరుద్ర నక్షత్రం రోజున స్వామివారికి ఈ స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

● స్వర్ణ రథోత్సవం ఏర్పాట్లపై సమీక్ష

గురువారం స్వామి, అమ్మవార్లకు జరగనున్న స్వర్ణరథోత్సవ కార్యక్రమ ఏర్పాట్లపై ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రథోత్సవ నిర్వహణకు సంబంధించి ఆయా ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయం, భద్రత, ఇంజనీరింగ్ మొదలైన విభాగాలన్నీ పరస్పర సమన్వయంతో ఉత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. స్వర్ణ రథోత్సవంలో ఉత్సవ వాతావరణం నెలకొనేలా కోలాటం, చెక్కభజనలు ఏర్పాటు చేయాలని ప్రజాసంబంధాల అధికారిని ఆదేశించారు. స్వర్ణరథాన్ని పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా విభాగం, పోలీసులు చర్యలన్నీ పకడ్బందీగా చూడాలన్నారు. సమావేశంలో ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, సీనియర్ వేదపండితులు, ఆలయ అధికారులు, స్థానిక సీఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం

కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్


కోవెలకుంట్ల సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతున్న కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్


కోవెలకుంట్ల, ఆగస్టు 28 : కోవెలకుంట్లలో బాలిక అత్యాచారం కేసులో కేసులో బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం నంద్యాల జిల్లాలోని డోన్, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, చాగలమర్రి పోలీసుస్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా స్టేష న్ల పరిధిలోని పరిస్థితులపై ఆరా తీశారు. కోవెలకుంట్ల సర్కిల్ కార్యాయలంలో డీఐజీ విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో కొందరు యువకులు గంజాయి, నాటుసారా వంటి మత్తు పదార్థాలకు బానిసలై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అన్నారు. వీటిని పూర్తిస్థాయిలో అరికట్టడానికి పోలీసు శాఖ గట్టి చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మట్కా, పేకాట కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పలుచోట్ల జరుగుతున్నాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పోలీసులను అప్రమత్తం చేశామని చెప్పారు. కోవెలకుంట్ల పట్టణంలో మతి స్థిమితం లేని బాలికపై కొందరు యువకులు అత్యాచారానికి ఒడిగట్టారని, దీనిపై పూర్తిసాయిలో విచారణ చేపడతామన్నారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఐజీ వెంట ఎస్పీ రాణా, ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్, కోవెలకుంట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టరు హనుమంతనాయక్, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

జిల్లా క్రీడా ప్రతిభా పురస్కారాలకు ఎంపిక

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 28: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ క్రీడల్లో విశేషంగా రాణించిన ఐదు పాఠశాలలు జిల్లా క్రీడా ప్రతిభ పురస్కారాలకు ఎంపికైనట్లు డీఈవో సుధాకరరెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి శివకుమార్ బుధవారం తెలిపారు. జిల్లాలోని పురస్కారాలకు ఎంపికైన పాఠశాలల్లో ప్రధాన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులకు పురస్కారాలను గురువారం జాతీయ క్రీడా దినోత్సవ సందర్భంగా అందజేయనున్నట్లు చెప్పారు. వరుస ఐదు స్థానాలలో డోన్ మండలం యు. కొత్తపల్లి జడ్పీ హైస్కూల్, రుద్రవరం జడ్పీ హైస్కూల్, గోస్పాడు మండలం దీబగుంట్ల జడ్పీ హైస్కూల్, దొర్నిపాడు మండలం భాగ్య నగరం జడ్పీ హైస్కూల్, నందికొట్కూరు గవర్నమెంట్ హైస్కూల్‌లు ఎంపికైనట్లు తెలిపారు. గురువారం నంద్యాలలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్‌రాజకుమారి చేతుల మీదుగా మెమెంటోలు ప్రశంసా పత్రాలు అందించడంతోపాటు సన్మానం ఉంటుందన్నారు.

అమ్మ భాషకు గొడుగు

- తెలుగు వ్యవహారిక భాషకు గుర్తింపు తెచ్చిన గిడుగు రామ్మూర్తి
- కైజర్ - ఈ - హిందూ బిరుదును ప్రకటించిన బ్రిటీష్ ప్రభుత్వం
- కళాప్రపూర్ణగా అభివర్ణించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం
- తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర
- నేడు తెలుగు భాషా దినోత్సవం



ఆత్మకూరు, ఆగస్టు 28: ఆదిమ సవర జాతి భాషకు లిపిని, నిఘంటువుని రూపొందించి, తెలుగు వాడుక భాషోద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్రగా నిలిచిపోయారు. తెలుగు వ్యావహారిక భాషా వ్యాప్తికి ఎనలేని కృషి సాగించిన గిడుగు గ్రాంథిక భాషా వాదుల పాలిట పిడుగు అన్న ప్రశంసలు అందుకున్నారు. తెలుగు వ్యావహారిక భాషా ఉద్యమానికి ఆద్యుడైన గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.


గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని రాష్ట్ర ప్రజలు మాతృభాషా దినోత్సవంగా పాటిస్తున్నారు. శిష్ట వ్యవహారికం పేరిట వాడుక భాషలో బోధనకు ఆయన పెద్దపీట వేశారు. శ్రీకాకుళం జిల్లాలోని పర్వతాల పేటలో 1863 ఆగస్టు 29వ తేదిన వీర్రాజు, వెంకమ్మ దంపతులకు గిడుగు జన్మించారు. 1875లో తండ్రి మరణించే వరకు పర్వతాలపేటలో చదువుకున్న ఆయన ఆ తర్వాత విశాఖలోని తన మేనమామ వద్ద వుంటూ ఉన్నత విద్యను పూర్తిచేశాడు. చదువుతున్న రోజుల్లోనే ముఖలింగ దేవాలయం శాసనాలను సొంతంగా చదివి అర్థం చేసుకున్నారు. 1879లో మెట్రిక్యులేషన్ పాసైన తర్వాత ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ.. మిగతా విద్యను కొనసాగించారు. కాగా 1886 నాటికి ఎఫ్ఏ, 1896 నాటికి బీఏ చదివారు. విజయనగరం జిల్లాలోని గణపతి మహారాజు పాఠశాల, కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు. తెలుగు భాషా బోధన వ్యావహారికంలో చేయాలన్న ఆయన ఆలోచనకు 1907లో ఉత్తర కోస్తా జిల్లాలకు స్కూళ్ల ఇన్‌స్పెక్టర్‌గా వచ్చిన జేఏ. యేట్స్ అనే ఆంగ్లేయుడి నుంచి మద్దతు లభించింది. అప్పటి ఏవీఎస్ కళాశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస అయ్యంగార్, గురజాడ అప్పారావు, యేట్స్, గిడుగు రామ్మూర్తి పంతులు కలిసి వ్యవహారిక భాషలో బోధనోద్యమానికి శ్రీకారం చుట్టారు. అప్పటికే రామ్మూర్తి వ్యవహారిక భాషలో బోధన కోసం ప్రచారం చేసేవారు. ఇందు కోసం తెలుగు అనే పత్రికను గిడుగు ప్రారంభించారు. ఆయన కృషి కారణంగా 1912-13 సంవత్సరంలో పాఠశాల ఫైనల్ బోర్డు తెలుగు వ్యాస పరీక్షను గద్యంలో లేదా వ్యావహారిక భాషలో రాయవచ్చునని ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి స్కూల్, కళాశాల పాఠ్యపుస్తకాలు వ్యవహారిక భాషలో వెలువడటం మొదలుపెట్టాయి. ఆ తర్వాత ప్రభుత్వం వేసిన ఓ కమిటీలో గ్రాంథికవాదుల ఆధిపత్యం వల్ల వ్యావహారిక భాషలో బోధనలు రద్దు చేసినా.. అనంతర కాలంలో పునరుద్ధరించారు. తెలుగుభాషకు గిడుగు చేసిన సేవలకు గుర్తుగా ఆయన జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకొంటున్నారు.



ఉత్తరాంధ్ర అడవుల్లో సవరుల భాషను నేర్చుకుని దానికి లిపిని రూపొందించి అందులో వారికి బోధించారు. సవర భాషకు నిఘంటువును తయారు చేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా మద్రాసు ప్రభుత్వం గిడుగుకు రావుబహద్దూర్ బిరుదునిచ్చింది. 1933లో బ్రిటీష్ ప్రభుత్వం కైజర్ - ఈ - హిందూ బిరుదు ఇచ్చింది. 1936లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. . వ్యవహారిక భాషకు ఎనలేని సేవలందించిన గిడుగు రామ్మూర్తి 1940 జనవరి 22న మరణించారు.

తెలుగుభాషకు ఆనాటి ప్రాధాన్యత నేడేదీ?

తెలుగు వ్యావహారిక భాష కోసం గిడుగు రామ్మూర్తి లాంటి ఎందరో మహానుభావులు ఎన్నెన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసినప్పటికీ ప్రపంచీకరణలో మార్పు కారణంగా తెలుగు మాధ్యమంలో కేవలం 25శాతం కన్నా తక్కువే విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వాలు ప్రాథమిక విద్యాస్థాయి నుంచే ఆంగ్ల మాధ్యమంలోనే పాఠశాలలను ఏర్పాటు చేయడంతో తెలుగు భాషకు మరింత నష్టం వాటిల్లింది. 2013లో రాష్ట్ర ప్రభుత్వం తెలుగు సాంస్కృతిక వికాస సంవత్సరంగా గుర్తించి అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర శాఖల్లో తెలుగుభాషతోనే పరిపాలన సాగించాలని నిర్ణయించినప్పటికీ అది అమలు కావడం లేదు.



తెలుగు భాషను విస్మరించడం దురదృష్టకరం



నేటి సమాజంలో తెలుగు భాషను విస్మరించడం దురదృష్టకరం. తెలుగు భాషకు నేడు కనీస ఆదరణ లేకపోవడం బాధాకరం. ఇటీవల పలు అధికార ఉత్తర్వుల్లో కూడా తెలుగు భాషలో అచ్చుతప్పులు వస్తున్నాయి.

- విద్యాసాగర్, తెలుగు అధ్యాపకుడు, ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు

గిడుగు కృషి మరువలేనిది



తెలుగు వ్యావహారిక భాషా అభ్యున్నతికి గిడుగు రామ్మూర్తి చేసిన కృషి అచంచలం. ఒకప్పుడు గ్రాంథిక భాష చాలామందికి అర్థమయ్యేది కాదు. ఈ ఇబ్బందులను గుర్తించిన గిడుగు రామ్మూర్తి అర్థం లేని భాష వ్యర్థం అన్న నానుడితో తెలుగు వ్యావహారిక భాషాభివృద్ధికి పూనుకున్నారు.

- డాక్టర్ వేమ సుజాత, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆత్మకూరు



వడివడిగా అడుగులు

కర్నూలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రగతి కలలు సాకారమయ్యే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఓర్వకల్లును పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని జూలై 23న పార్లమెంట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 35 రోజుల కూడా గడవకనే తీపి కబురు అందించారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ)లో భాగంగా దేశంలో 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందులో ఓర్వకల్లు ఇండిస్ట్రియల్ స్మార్ట్ సిటీ కూడా ఉంది. ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని అభివృద్ధి చేస్తారు. రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు కల్పించేలా ప్రాజెక్టు డిజైన్ చేశారు. 45 వేల మందికిపైగా ప్రత్యేక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగాలు లభించనున్నాయి. అలాగే.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో నేషనల్ అనిమల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం కేంద్రం, వైరల్ వ్యాక్సిన్ ప్రొడక్షన్ యూనిట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన కందనవోలు ముగింట పారిశ్రామిక ప్రగతి రెక్కలు విప్పుకోనుంది.

- ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా ఓర్వకల్లు
- ఫేజ్-1లో 2,612 ఎకరాల్లో ఏర్పాటు
- ప్రాజెక్టు విలువ రూ.2,786 కోట్లు
- పెట్టుబడులు రూ.12 వేల కోట్లు
- ఆటోమొబైల్, ఫార్మాస్యూటికల్స్, వస్త్ర పరిశ్రమలు వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి
- 45 వేల మందికి ఉపాధి అవకాశాలు
- కేంద్ర ప్రభుత్వం ఆమోదం

● ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి రవాణా సౌకర్యం, దూరం కి.మీలలో

రవాణ సౌకరం	దూరం కి.మీలలో
నేషనల్ హైవే-40 (కర్నూలు-రాణిపేట)	4
నేషనల్ హైవే-44 (శ్రీనగర్-కన్యాకుమారి)	28
నేషనల్ హైవే-340సీ (కర్నూలు-ప్రకాశం)	26
కర్నూలు రైల్వే స్టేషన్	35
దూపాడు రైల్వే స్టేషన్	30
వెల్దుర్తి రైల్వే స్టేషన్	28
బేతంచర్ల రైల్వే స్టేషన్	28
కర్నూలు విమానాశ్రయం	12
కృష్ణపట్నం పోర్టు	320
కత్తుపట్టి పోర్టు, పొన్నేరి	420
సూరరెడ్డిపాలెం, ఒంగోలు	270
ఐడీసీ తిమ్మాపూర్, రంగారెడ్డి	210



● చంద్రబాబు విజన్.. మోదీ సహకారం

రాష్ట్ర విభజన తరువాత కొలువుదీరిన అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లా పారిశ్రామిక ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించింది. కర్నూలు నగరానికి 20 కిలోమీటర్ల దూరంలో ఓర్వకల్లు వద్ద సాగుకు పనికిరాని 33 వేల ఎకరాలు గుర్తించి 'ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్'గా ఏర్పాటు చేశారు. ఆసియాలోనే అతి పెద్ద వెయ్యి మెగా వాట్ల సోలార్ యూనిట్ ఏర్పాటు చేశారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ప్రపంచంలోనే తొలి పంప్డ్ స్టోరేజ్ పవర్ ఉత్పత్తి యూనిట్ 3,500 మెగా వాట్లతో ఏర్పాటుకు నాంది పలికారు. వివిధ రంగాల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపాలంటే విమానాయ రవాణా సౌకర్యం ఎంతో కీలకమని గుర్తించి చంద్రబాబు 1,010 ఎకరాల విస్తీర్ణంలో కొండలను పిండి చేసి రూ.110 కోట్లతో కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం నిర్మించారు. నీటి సౌకర్యం కోసం ముచ్చుమర్రి లిఫ్ట్ నుంచి 4 టీఎంసీలు ఎత్తిపోసి నిల్వ చేసేందుకు జలాశయం నిర్మాణం, కర్నూలు రైల్వే స్టేషన్ సమీపంలోని దూపాడు రైల్వే స్టేషన్ నుంచి రైల్వేలైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నందికొట్కూరు దగ్గర మెగా సీడ్ హబ్, జైన్ ఇరిగేషన్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అన్ని సవ్యంగా జరిగి ఉంటే ఇప్పటికే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ కేంద్రంగా పలు పరిశ్రమలు స్థాపించి కార్మికులు, ఉత్పత్తులతో కళకళలాడేది. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ పడకేసింది. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు మహర్దశ వచ్చింది.





2,612 ఎకరాలు.. రూ.2,786 కోట్లతో అభివృద్ధి

సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. నవ్యాంధ్ర ప్రగతి కోసం వివిధ అభివృద్ధి పనులు సహా పారిశ్రామిక ప్రగతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని విన్నవించారు. జూలై 23న హైదరాబాదు-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా 'ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్' అభివృద్ధి చేస్తామని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో స్పష్టంగా వెల్లడించారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా ఫేజ్-1 కింద 2,621 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధి చేసేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ నిధులతో నీరు, రోడ్లు, రవాణా, విద్యుత్.. వంటి మౌలిక సౌకర్యాలు కల్పిస్తారు. నాన్ మెటలిక్ మినరల్ పరిశ్రమలు, ఆటోమొబైల్ రంగం విడి భాగాలు తయారి, పునరుత్పాదక పరిశ్రమలు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ హార్డ్‌వేర్, ఫార్మాస్యూటికల్స్, వజ్రాలు, బంగారు ఆభరణాల తయారీ, వస్త్ర ఉత్పత్తి రంగ పరిశ్రమలు ఇక్కడే ఏర్పాటు చేసేందుకు నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) ప్రత్యేక దృష్టిని పెట్టింది. ఆయా పరిశ్రమలు ఏర్పాటు కోసం రూ.12 వేల కోట్లు పెట్టుబడులు వస్తాయని, తద్వారా 45,071 మంది యువతకు ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేశారు.

● బనవాసిలో ఎన్ఏడీసీపీ సెంటర్!

జాతీయ పశు ఆరోగ్యం, వ్యాధి నియంత్రణ కార్యక్రమం (ఎన్ఏడీసీపీ)లో భాగంగా ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో వ్యాక్సిన్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ కేంద్రం హైదరాబాదులో ఉంది. రాష్ట్ర విభజన తరువాత ఏపీలో ఎక్కడా ఏర్పాటు చేయలేదు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో నిర్వహించే ఎన్ఏడీసీపీ కేంద్రం బనవాసిలో ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని గుర్తించారు. ఈ పశుక్షేత్రంలో పశుసంవర్ధక శాఖకు సుమారు మూడు వేల ఎకరాలకు పైగా భూమి ఉంది. ఎన్ఏడీసీపీకి 100-150 ఎకరాలు అవసరం. అలాగే.. దేశంలో మూడు మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందులో ఒకటి బనవాసి పశు క్షేత్రంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కోరుతోంది.

● ఉమ్మడి జిల్లాలో 10 ఎఫ్ఎం చానల్స్

దేశవ్యాప్తంగా 234 నగరాలు, పట్టణాల్లో 730 ఎఫ్ఎం రేడియో కేంద్రాల ఏర్పాటుకు బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అందులో ఉమ్మడి జిల్లాలో ఆదోనిలో 3, కర్నూలులో 4, నంద్యాలలో 3 కలిపి 10 ఉన్నాయి. ఈ చానల్స్ ఏర్పాటు వల్ల మాతృభాషా అభివృద్ధి సహా యువతకు కొత్తగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.



హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ సంస్థకు వినియోగదారుల కమిషన్ మొట్టికాయ

కర్నూలు(లీగల్), ఆగస్టు 28: మృతి చెందిన తర్వాత బీమా మొత్తం చెల్లిస్తామని హామీ ఇచ్చి.. తీరా మృతి చెందిన పిదప తగిన కారణాలు చెప్పకుండా బీమా మొత్తం చెల్లించేందుకు తిరస్కరించిన హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థకు జిల్లా వినియోగదారుల కమిషన్ తగిన రీతిలో మొట్టికాయ వేసింది. ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ గ్రామానికి చెందిన కే. శ్రీనివాసులు నాయుడు 2018లో రూ.15 లక్షలకు, 2021జూన్‌లో రూ.18.78లక్షలకు వేర్వేరుగా రెండు బీమా పాలసీని తీసుకున్నాడు. ఆ తర్వాత అతను 2022 సెప్టెంబరు నెలలో గుండెపోటుతో మృతి చెందాడు. బీమా సొమ్ము కోసం మృతుడి భార్య ఇన్సూరెన్స్ సంస్థకు దరఖాస్తు చేసుకుంది. 2018లో తీసుకున్న పాలసీపై ఉన్న మొత్తాన్ని హెచ్‌డీఎఫ్‌సీ సంస్థ చెల్లించింది. అయితే.. 2021లో తీసుకున్న పాలసీ మొత్తాన్ని ఇవ్వడానికి సంస్థ నిరాకరించింది. దీనిపై హెచ్‌డీఎఫ్‌సీ వివరణ ఇస్తూ రెండో పాలసీని తీసుకోవడానికి ముందే మృతుడు స్థానిక ఒక ప్రైవేటు వైద్యశాలలో గుండె వ్యాధికి చికిత్సలు తీసుకున్నాడని, ఈ విషయాన్ని మరుగుపరిచి రెండో పాలసీని తీసుకున్నందుకు ఆ పాలసీని తిరస్కరిస్తున్నట్లు సంస్థ తెలిపింది. కేసును విచారించిన జిల్లా వినియోగదారుల కమిషన్ రెండో పాలసీపై మొత్తాన్ని చెల్లించకపోవడం సేవాలోపం అవుతుందని మృతుడు చికిత్స తీసుకున్నట్లు సాక్ష్యాధారాలను చూపకుండా తిరస్కరించడం సేవాలోపం అవుతుందని నిర్ధారించింది. దీంతో రెండో పాలసీ మొత్తం రూ.19 లక్షలను 9 శాతం వడ్డీతో పాటు కోర్టు ఖర్చుల కింద అదనంగా మరో రూ.30వేలను ఫిర్యాదికి చెల్లించాలని ఆదేశిస్తూ కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్. నారాయణ రెడ్డి, నజీమా కౌసర్లు తమ తీర్పులో పేర్కొన్నారు.

పెద్దాసుపత్రికి విరాళంగా ఫ్యాన్లు

● కాలిఫోర్నియాకు చెందిన ఎన్ఆర్ఐ చేయూత

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 28: కర్నూలు మెడికల్ కాలేజీ గ్రాడ్యుయేట్స్ ట్రస్టు హైదరాబాదు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు 25 ఫ్యాన్లు విరాళంగా అందించింది. కర్నూలు మెడికల్ కాలేజీ 1962 బ్యాచ్‌కు చెందిన కోవెలకుంట్ల నివాసి డా. విశ్వనాథరెడ్డి అమెరికా చికాగోలో పని చేసి కాలిఫోర్నియాలో స్థిరపడ్డారు. ఆసుపత్రికి క్రాంప్టన్ హై స్పీడ్ 1200 ఎంఎం 25 ఫ్యాన్లను విరాళంగా ఇచ్చిన డా.విశ్వనాథరెడ్డిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు 25 ఫ్యాన్లను కేఎంసీ గ్రాడ్యుయేట్ల ట్రస్ట్ సెక్రటరీ డా.రామలింగారెడ్డి ద్వారా ట్రస్టు సభ్యులు గౌరి గోపాల్ హాస్పిటల్ డైరెక్టర్ డా. శివశంకర్ రెడ్డి సూపరింటెండెంట్‌కు అందించారు.



ఎన్ఆర్ఐ విరాళంగా ఇచ్చిన ఫ్యాన్లను సూపరింటెండెంట్‌కు అందిస్తున్న రిటైర్డు డీఎంహెచ్‌వో డా.శివశంకర్ రెడ్డి

శ్రీరాముని నూతన రథానికి శ్రీకారం

రూ.12.50 లక్షలు వెచ్చించనున్న తుగ్గలి నాగేంద్ర

అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు అందజేత



తుగ్గలిలో శ్రీరాముని నూతన రథానికి అడ్వాన్సు ఇస్తున్న తుగ్గలి నాగేంద్ర దంపతులు

తుగ్గలి, ఆగస్టు 28: శ్రీరామునికి నూతన రథం చేయించడానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యులు వరలక్ష్మి ముందుకు వచ్చారు. బుధవారం మండల కేంద్రమైన తుగ్గలి శ్రీరాముల ఆలయంలో నూతన రథాన్ని రూ.12.50 లక్షలతో చేయిస్తున్నారు. ఈ మొత్తాన్ని తుగ్గలి నాగేంద్ర దంపతులు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా రథం తయారు చేసే వారికి రూ.5 లక్షలు నగదును అడ్వాన్సుగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాముల దేవాలయ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. ప్రతి పేదవాడికి చేదోడుగా ఉంటూ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని అన్నారు. వచ్చే శ్రీరామనవమి వేడుకలకు నూతన రథం సిద్ధం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అల్లాబకాష్, ఆకుల శీనప్ప, సర్పంచులు రవి, మాజీ వైస్ ఎంపీపీ విజయభాస్కర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా వసూలు చేస్తే లైసెన్సులు రద్దు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 28: కొంత మంది కమీషన్ ఏజెంట్లు రైతుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నారని, అలాంటి వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామని యార్డులోని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విక్రయానికి తెచ్చిన పంట ఉత్పత్తులపై రైతుల నుంచి ఎక్కువ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయన్నారు. వేరుశనగ తదితర పంట ఉత్పత్తులకు ఒక కుప్పకు రూ.100 నుంచి రూ.200 వసూలు చేస్తున్నట్లు తెలియడంతో కర్నూలు మార్కెట్ కమిటీ అధికారులు రైతుల నుంచి చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఏ పంట సరుకుకు ఎంత కమిషన్ తీసుకోవాలో పేర్కొంటూ పట్టికను మార్కెట్ యార్డు అంతటా ఏర్పాటు చేశారు.

ఆర్ఐవో అవినీతిపై విచారణ

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 28: కర్నూలు జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవో గురువయ్య శెట్టిపై వచ్చిన ఆరోపణలపై ఇంటర్మీడియట్ బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సుబ్బారావు బుధవారం విచారణ చేపట్టారు. పబ్లిక్ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్, ట్రాన్స్‌పోర్టు నిధులు దుర్వినియోగం, ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలో ప్రైవేటు కళాశాల యాజమాన్యాలతో కుమ్మక్కై ఆర్ఐవో గురువయ్య శెట్టి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై విచారణ చేపట్టారు. డీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు మహేంద్రబాబు, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంఘం నాయకులు సుంకన్న, అధ్యాపకుల సంఘం నాయకులతో పాటు కార్యాలయంలోని అధికారులు, సిబ్బందిని వేర్వేరుగా విచారణ చేపట్టారు. విచారణ జరుగుతున్న సమయంలో డీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆర్ఐవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆర్ఐవో గురువయ్యశెట్టిపై వచ్చిన అవినీతిని నిక్కచ్చిగా నిగ్గు తేల్చి సస్పెండ్ చేయాలని డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మహేంద్ర నాయుడు డిమాండ్ చేశారు.

రైలు కింద పడి ప్రేమ జంట ఆత్మహత్య

మద్దికెర, ఆగస్టు 28: రైలు కింద పడి ఓ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కర్నూలు జిల్లా మద్దికెరలో బుధవారం చోటు చేసుకుంది. మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ప్రతాప్‌సింగ్, ఉమా దంపతులు కొన్నేళ్ల కిందట గుంతకల్లు పట్టణానికి వచ్చి పానీ పూరి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే మధ్యప్రదేశ్‌లోని మెహతాన్‌పురం గ్రామానికి చెందిన కులదీప్ పరియార్ (22) అనే యువకుడిని ఇక్కడికి తీసుకొచ్చి పానీ పూరి బండి దగ్గర పని చేయడానికి పెట్టుకున్నారు. కులదీప్ పరియార్ ఏడేళ్ల నుంచి ప్రతాప్ సింగ్ వద్దే పని చేస్తూ వచ్చాడు. అయితే డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రతాప్‌సింగ్ కూతురు మీనా.. కులదీప్ పరియార్ ప్రేమలో పడింది. విషయం యువతి తల్లిదండ్రులకు తెలియడంతో కులదీప్ పరియార్‌ను మందలించారు. దీంతో ప్రతాప్‌సింగ్ వద్ద పనిమానేసి గుంతకల్లు పట్టణంలో కసా పురం వెళ్లే దారిలో కులదీప్ పరియార్ సొంతంగా పానీపూరి వ్యాపారం పెట్టుకు న్నాడు. అయినప్పటికీ వీరి ప్రేమ అలాగే కొనసాగుతూ వచ్చింది. ఈ నెల 27న ఇద్దరు వారి పెద్దలకు చెప్పకుండా పారి పోయారు. దీంతో యువతి తల్లిదండ్రులు కసాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ఆ ప్రేమజంట మద్దికెర సమీపంలో బుధవారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. అయితే.. తమ చావుకు ఎవరూ కారణం కాదని, హిందీ, ఇంగ్లీషు భాషలో ఉత్తరం రాసి అక్కడే పెట్టి ఆత్మహత్య చేసుకున్నారు. గుంతకల్లు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కులదీప్ పరియార్, మీనా (ఫైల్)

నగర పాలక సంస్థ కమిషనర్‌గా పీవీవీఎస్ మూర్తి?

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 28: నగర పాలక సంస్థ కమిషనర్‌గా పీవీవీఎస్ మూర్తిని ప్రభుత్వం నియమించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో ఇక్కడే పని చేసిన అనుభవం ఉండటంతో కమిషనర్‌గా నియమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన అనంతపురంలోని రీజినల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నెల క్రితం రవీంద్రబాబును నియమిస్తారని అనుకున్నారు. అయితే నాన్ ఐఏఎస్‌లు వద్దని ప్రకాశం జిల్లా కందుకూరు సబ్ కలెక్టర్‌గా పని చేస్తున్న విద్యాధరిని ప్రభుత్వం నియమించింది. అయితే అనివార్య కారణాలతో రెండు రోజుల క్రితం విద్యాధరిని చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. ఈ క్రమంలో మళ్లీ రవీంద్రబాబు పేరు వినిపిస్తోంది. అయితే రవీంద్రబాబు మీద పలు ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఆయన రాకను మహిళలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పీవీవీఎస్ మూర్తి పేరు దాదాపు ఖరారు అయినట్లు తెలుస్తోంది.

బాలికపై అత్యాచార యత్నం

హొళగుంద, ఆగస్టు 28 : హొళగుంద మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన నాగేష్ అనే వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు ఎస్సై బాల నరసింహులు తెలిపారు. బాలిక మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో తన ఇంటికి కొద్ది దూరంలోని కిరాణ దుకాణానికి వెళ్తుండగా అక్కడే ఉన్న నాగేష్ అనే వ్యక్తి చెయ్యి పట్టుకున్నాడు. మరో చేత్తో నోరు మూసి నిర్మాణ దశలో ఉన్న ఇంటిలోకి ఎత్తుకెళ్లాడు. అత్యాచారానికి పాల్పడుతుండగా బాలిక గట్టిగ కేకలు వేసింది. దీంతో నిందితుడు భయంతో అక్కడే బాలికను వదిలి పారిపోయాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

డోన్(రూరల్), ఆగస్టు 28: పట్టణంలోని కర్నూలు రైల్వే గేట్ల సమీపంలో తెల్లవారుజామున గుర్తు తెలియని రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన చాకలి గాలెన్న (42) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతునికి భార్యతో పాటు కొడుకు, కూతురు ఉన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో దాస్

పాములపాడు, ఆగస్టు 28: మండలంలో జరుగుతున్న నేషనల్ హైవే పనుల్లో భూములు, ఇళ్ళు కోల్పోయిన బాధితులకు పరిహారం తదితర విషయాల్లో సమస్యలను పరిష్కరించడంలో వీఆర్వోలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో దాస్ హెచ్చరించారు. బుధవారం పాములపాడు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రిష్టరావు పేటలోని సత్యనారాయణ దుకాణం, ఆంజనేయస్వామి గుడి, సంతమార్కెట్, కల్లాలు, రుద్రవరం గ్రామ శివార్లలోని జెరుసలేం చర్చి, పాములపాడు, ఎర్రగూడూరులో కొన్ని సమస్యలు ఉన్నాయని, బాధితులతో మాట్లాడి అడ్డంకులు లేకుండా చూడాలని వీఆర్వోలకు సూచించారు. పరిహారం అందినా స్థలం ఖాళీ చేయకుండా ఉండేవాటిని పోలీసుల సహకారంతో కూల్చేస్తామని తెలిపారు. కొత్త ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతున్న భూ సమస్యల పరిష్కార వేదికను సమగ్రంగా, బాధ్యతగా నిర్వహించాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో డీటీ, ఆర్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోవాలి: ఏడీఏ



మిడుతూరు: పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ

మిడుతూరు, ఆగస్టు 28: ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని ఏడీఏ విజయశేఖర్ రైతులకు సూచించారు. మిడుతూరులో పంట నమోదును ఏడీఏ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదును సెప్టెంబరు 15 తేదీలోపల పూర్తి చేయా లని తెలిపారు. వ్యవసాయాధికారి పీరునాయక్, వీహెచ్ఏ అశోక్ రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: రైతులు పంట నమోదు చేయించుకోవాలని ఉద్యానవన శాఖ అధికారిణి చందన అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలం కృష్ణాపురం గ్రామంలో మిరప పంటలో ఈ క్రాప్ బుకింగ్‌ను ఉద్యానవన శాఖ అధికారిణి చందన పరిశీలించారు. వీఏఏ నరసింహ ,ఉద్యావన సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

వెలుగోడు, ఆగస్టు 28: వెలుగోడు మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం బుధవారం మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశానికి పలువురు అధికారులు ప్రజా ప్రతినిధులు గైర్హాజరు కావడంతో సమావేశాన్ని తూతూ మంత్రంగా ముగించారు. హాజరైన అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. హాజరైన ప్రజా ప్రతినిధులు సైతం ఉత్సవ మూర్తుల్లా కూర్చున్నారే తప్ప సమస్యలపై మాట్లాడలేదు. కేవలం ముగ్గు ఎంపీటీసీలు ఒక్క సర్పంచ్ తప్ప ఇంకెవరూ మాట్లాడకపోవడంతో సమావేశాన్ని మొక్కుబడిగా నిర్వహించి మమ అనిపించారు. ఎంపీపీ లాలం రమేష్ మాట్లాడుతూ.. సమావేశానికి హాజరు కాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో అమానుల్లా, తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 28: నంద్యాల పట్టణంలోని కాళికాంబ చంద్రశేఖరస్వామి, కోటవీధిలోని బ్రహ్మానందీశ్వరస్వామి ఆలయాల హుండీని బుధవారం ఆలయాల టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ పర్యవేక్షణలో ఈవో లక్ష్మీనారాయణ నిర్వహణలో లెక్కించారు. కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయ హుండీ సంవత్సరకాలానికి లెక్కించగా రూ.8,68,199, బ్రహ్మానందీశ్వరస్వామి దేవస్థానం హుండీ ద్వారా సంవత్సర కాలానికి రూ.46,328 వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు సుబ్రహ్మణ్యం శాస్త్రి, వెంకటరమణాచారి, మురళీకృష్ణ, సురేష్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి: ఎంపీ



తాగునీటి సమస్యపై చర్చిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

నందికొట్కూరు, ఆగస్టు 28: ఇది వైసీపీ కాదని...వర్గపోరు లేకుండా అందరూ కలిసికట్టుగా పని చేస్తేనే నందికొట్కూరు అభివృద్ధి సాధ్యమని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఎంపీతో పాటు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ ప్రధానంగా తాగునీరు, ఎడ్యుకేషన్, ఆసుపత్రుల కోసం ఎంపీ నిధులను కేటాయిస్తామన్నారు. పట్టణంలో 6 మినరల్ వాటర్ ప్లాం ట్లను మంజూరు చేయిస్తామన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ ఒకటి సరిపోదని అన్నారు. హంద్రీ నీవా కాలువకు అనుసంధానం చేస్తూ మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నిర్మించాలని ఆమె సూచించారు. దిశ కమిటీలో 42 కేంద్ర పథకాలు ఉన్నాయని, వాటిని ఎన్ఆర్ఈజీఎస్, జల్‌జీవన్ మిషన్ తదితర పనులను కమిటీ సభ్యుల ఆమోదం తీసుకోవాలన్నారు. గత ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. గతంలో దివ్యాంగులకు ఇంటి స్థలాలు ఇచ్చామని, ఆ స్థలాల్లో ఎవరెవరికి ఇచ్చామో ఆ వివరాలు వారం రోజుల్లో అందజేయాలని ఆదేశించారు. ఆ ప్రదేశంలో దివ్యాంగుల కోసం స్కిల్ డవలప్‌మెంట్ కోర్సును ఏర్పాటు చేసేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారన్నారు. మారుతినగర్, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్‌లలో ఆక్రమణకు గురైన స్థలాల గురించి సంబంధిత వివరాలు కావాలని ఆమె కమిషనర్‌కు తెలిపారు.

అభివృద్ధి వైపు అడుగులు వేద్దాం: ఎమ్మెల్యే

ప్రజలు ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా డా. బైరెడ్డి శబరికి అవకాశం కల్పించారని, వారి అభివృద్ధి కోసమే అడుగులు వేస్తామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. టీడీపీ హయాంలో నందికొట్కూరు తాగునీటి శాశ్వత పరిష్కారం కోసం అలగనూరు రిజర్వాయర్ నుంచి ఓ సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ కోసం రూ.120 కోట్లు కేటాయిస్తే... 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో ఆ ప్రాజెక్టును తుంగలో తొక్కిందని అన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పోలీసు బందోబస్తు ఏర్పాటు

ఎప్పుడూ లేని విధంగా నందికొట్కూరు కౌన్సిల్ సమావేశం ఈ సారి ఉత్కంఠగా సాగింది. ఓ వైపు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మరో వైపు ఎంపీ డా.బైరెడ్డి శబరి హాజరు అవుతుండడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, నందికొట్కూరు, జూపాడుబంగ్లా ఎస్ఐలు చంద్రశేఖర్, సురేష్‌బాబు, లక్ష్మీనారాయణ, స్పెషల్ పార్టీ పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సమావేశానికి అధికారులు, కౌన్సిలర్లు, మీడియా ప్రతినిధులను తప్ప మరెవ్వరినీ సమావేశానికి హాజరు కానివ్వలేదు. నందికొట్కూరు పురపాలక సంఘం స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా వెంకటరమణ ఎంపికయ్యారు. చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ రబ్బాని, డీఈ నాయబ్ రసూల్, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 28: గ్రామాల్లో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే జయసూర్య అధికారులకు సూచించారు. నందికొట్కూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జయసూర్య హాజరయ్యారు. వివిధ శాఖల అధికారుల దృష్టికి వచ్చిన సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని సమస్యల గురించి గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కొణిదెల సర్పంచ్ నవీన్ మాట్లాడుతూ గ్రామంలో ఆరు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఐదు కేంద్రాల్లో అద్దె భవనంలో ఉన్నాయని చెప్పారు. అలాగే వడ్డెమాను, కోనేటమ్మపల్లి గ్రామ సర్పంచ్‌లు కూడా ఇదే సమస్యను లేవనెత్తారు. దీనిపై ఎమ్మెల్యే జయసూర్య ఐసీడీఎస్ సీడీపీవో కోటేశ్వరమ్మను వివరణ కోరారు. నందికొట్కూరు పట్టణంలో 32 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో 40 అంగన్‌వాడీ సెంటర్లు ఉంటే అందులో కూడా దాదాపు 15 సెంటర్లు అద్దె భవనాల్లో ఉన్నాయని చెప్పారు. పట్టణంలో స్థల సమస్య ఉందని చెబుతున్నారని, అయితే గ్రామాల్లో అద్దె భవనాల్లో ఎందుకు కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణంలో ఉన్న భవనాలను త్వరగా పూర్తి చేయాలని, లేని వాటికి స్థల సేకరణలో చొరవ చూపాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సమస్యలు కూడా ఎక్కువగా ఉన్నాయని గ్రామ సర్పచులు తెలిపారు. ఎంపీడీవో శోభారాణి, తహసీల్దార్ శ్రీనివాసులు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి: సీపీఎం



అమలాపురం చెంచు గూడెంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 28: విద్యుత్ రంగ కార్మిక అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధమవ్వాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న ఆటో స్టాండ్‌లో 24వ విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యుత్‌రంగ కార్మికుల పోరాటంలో భాగంగా అశువులు బాసిన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, గణపతి, వీరన్న, శివకుమార్, చాంద్‌బాషా, కలిముల్లా, జబీవుల్లా, వలి, ముర్తుజా, విజయ్, రవి ఉన్నారు.

ఆత్మకూరురూరల్: వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు తలొగ్గి రైతుల ఉచిత విద్యుత్ స్థానంలో, స్మార్ట్ మీటర్ల పేరుతో రైతాంగానికి తీరని ద్రోహం చేశారని, విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి నరసింహ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అమలాపురం చెంచు గూడెంలో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి అసువులు బాసిన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు మూగన్న, గంగమ్మ, పెద్దన్న, నాగన్న, వెంకటమ్మ, మైసమ్మ, గురువమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఎంఈవో మృతి

మహానంది, ఆగస్టు 28: మహానంది మండలం ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఎంఈవో బి.ప్రసాదరావు(70) బుధవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1977లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరి అర్థగేరి, చింతకుంట్ల, రామగిరి, చాపిరేవులల్లో 38 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా పనిచేస్తూ 2012 సంవత్సరం మే 31న నంద్యాల మండల విద్యాశాఖాధికారిగా ప్రసాదరావు పనిచేస్తూ పదవీ విరమణ చేసారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా, ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా అనేక బహుమతులు పొందారు. కేంద్ర ప్రభుత్వంచే ఉత్తమ జనాభా గణకుడిగా అవార్డును ప్రసాదరావు పొందారు. పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయిలు మృతదేహానికి నివాళి అర్పించారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 28: టీడీపీ సీనియర్ నాయకుడు మాజి కౌన్సిలర్ బలిజ సామాజికవర్గ నాయకుడు చింతల సుబ్బరాయుడు మృతి టీడీపీ పార్టికి తీరని లోటని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. చింతల సుబ్బరాయుడు కుటుంబాన్ని బుధవారం ఎంపీ శబరి పరామర్శించారు.

'దివ్యాంగులకు అండగా ఉంటా'

దివ్యాంగులకు అండగా ఉంటామని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాలలోని తన కార్యాలయం నుంచి కాన్వాయ్‌గా వెళుతుండగా మండలంలోని చాబోలు గ్రామం దళిత కాలనీకి చెందిన భీమన్న అనే అంధుడు ఎంపీ శబరిని కలిశారు. తనకు అంధత్వం ఉన్నా దివ్యాంగు పెన్షన్ రావడం లేదని ఫిర్యాదు చేశారు. వెంటనే ఎంపీ కలెకటర్‌తో మాట్లాడి దివ్యాంగులకు వచ్చే రూ.6 వేల పెన్షన్‌ను అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

గ్లోబల్ సమ్మిట్‌కు ఎంపీకి ఆహ్వానం

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 28: రాజస్థాన్‌లోని మౌంట్ అబు శాంతి వనం ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో అక్టోబరు 4వ తేది నుంచి 7వ తేది వరకు జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఎంపీ బైరెడ్డి శబరికి ఆహ్వానం అందింది. బుధవారం నంద్యాలలోని ఎంపీ కార్యాలయంలో శబరిని బ్రహ్మ కుమారి సావిత్రి, హరి ప్రియ కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. వారు మాట్లాడుతూ.. దేశం నలు మూలల నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రులు కేంద్ర మంత్రులు, వివిధ రంగాలలోని ప్రముఖులు గ్లోబల్ సమ్మిట్‌కు హారవుతున్నారని తెలిపారు.

'వ్యాధుల నివారణపై అవగాహన ఉండాలి'



మాట్లాడుతున్న సంపూర్ణ సురక్షా కేంద్రం మేనేజర్ జబీవుల్లా

ఆత్మకూరు, ఆగస్టు 28: వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సంపూర్ణ సురక్షా కేంద్రం మేనేజర్ జబీవుల్లా సూచించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అసురక్షిత లైంగిక సంబంధాలు, కలుషిత రక్తమార్పిడి, వాడిన సిరంజీ, బ్లేడ్లను వాడటం వల్ల ఎయిడ్స్ సంక్రమించే ప్రమాదం ఉందని అన్నారు. అనంతరం సంపూర్ణా సురక్షా కేంద్రం ఔట్ రీచ్ వర్కర్ శ్వేత గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. హెచ్ఎం షహనాజ్, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్ ఉన్నారు.

తాగునీటి సమస్య.. ప్రజల అవస్థలు



ట్యాంకర్ వద్ద బిందెలను క్యూలో పెట్టిన ప్రజలు

వెలుగోడు, ఆగస్టు 28: వెలుగోడు పట్టణానికి కూతవేటు దూరంలో సుమారు పది టీఎంసీల సామర్థ్యం గల తెలుగుగంగ జలాశయం ఉన్నప్పటికీ పట్టణంలో తాగునీటి సమస్యలు నెలకొంటున్నాయి. వెలుగోడు పట్టణానికి తాగునీటిని అందించే మంచి నీటి పథకాలకు సంబంధించిన, మోటార్లు, పైప్‌లైన్ల మరమ్మతులకు గురైనా తాగునీటి సమస్యలు తలెత్తుతూనే ఉంటాయి. పట్టణానికి తెలుగుగంగ జలాశయం నుంచి పలు కాలనీలతో పాటు పలు గ్రామాలకు తాగునీటిని అందిస్తు న్నారు. అయితే పట్టణంలోని సీపీ నగర్ కాల నీలో నేటికి కూడా బోరు నీటినే ట్యాంకు ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ట్యాంకుకు నీరెక్కించే మోటారు మరమ్మతులకు గురి కావడంతో గత ఐదు రోజుల నుంచి తాగు నీరు అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌కు సంబంధించిన విద్యుత్ మోటార్లు కూడా రెండు రోజుల క్రితం మరమ్మతులకు గురి కావడంతో ఆ పథకం కూడా పడకేసింది. దీంతో వెలుగోడు పట్టణంతో పాటు పలు గ్రామాలకు నీటి సరఫరా నిలిచి పోయింది. దీంతో వెలుగోడు పట్టణంలో గ్రామ పంచాయతీకి సంబంధించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. సర్పంచ్ జయపాల్‌ను వివరణ కోరగా మోటరు మరమ్మ తులకు గురైందని, మరమ్మ తులు చేయిస్తున్నా మని చెప్పారు. అప్పటివరకు నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు.

వసతి గృహాల తనిఖీ



పాణ్యం: భోజనాన్ని పరిశీలిస్తున్న డీపీవో

పాములపాడు, ఆగస్టు 28: పాములపాడులోని వసతి గృహాలను ఎంపీడీవో గోపీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు బుధవారం తనిఖీ చేశారు. స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహం, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లోని వసతి గృహాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వసతి గృహాల్లోని సమస్యలు, చేపట్టాల్సిన పనులు, కావాల్సిన సామగ్రి తదితర వివరాలను తెలుసుకొన్నారు. వాటి నివేదికలను ఉన్న తాధికారులకు పంపుతామని తెలిపారు. కేజీబీవీ ప్రిన్సిపాల్, రాజ్యలక్ష్మి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ నాగ రవీంద్ర, ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్ అనిత పాల్గొన్నారు.

శ్రీశైలం: శ్రీశైలం దేవస్థానం పరిధిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని స్థానిక ఎమ్మార్వో బుధవారం తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తహసీల్దార్ కేవీ శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వార్డెన్ వెంకటేశ్వర్లు వివరించారు. తనిఖీల్లో భాగంగా విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, తాగునీరు, భోజనం మొదలైన వాటిని తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ఆర్వో ప్లాంట్‌ను మరమ్మతులు అవసరమని తగు నివేదికను కలెక్టర్‌కు పంపించనున్నట్లు తెలిపారు.

కొత్తపల్లి: ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం ప్రతిపాదనలు పంపనున్నట్లు తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. బుధవారం తహసీల్దార్ ఉమారాణి డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్నతో కలిసి మండలంలోని శివపురం గిరిజన ఆశ్రమ పాఠశాలను, కొత్తపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులకు కావాల్సిన కనీస సౌకర్యాలపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పాణ్యం: స్థానిక సంక్షేమ వసతిగృహాలను బుధవారం జిల్లా పంచాయతీ అధికారి మంజులావాణి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలోని సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు సరైన వసతులు లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలకు సుగాలిమెట్ట వద్ద ఐదెకరాల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని ప్రిన్సిపాల్ కృష్ణానాయక్ తెలిపారు. ఇరుకు గదుల్లో తరగతులు, నివాసాలను డీపీవో పరిశీలించారు. సంక్షేమ గృహాన్ని గురుకుల పాఠశాలగా మార్చడంతో విద్యార్థులకు సౌకర్యాలు కరువయ్యాయన్నారు. పాఠశాల నుంచి బయటికి వెళ్లే మురుగుకు సరైన డ్రైనేజీ లేదన్నారు. పాఠశాల భవన నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తే తప్ప విద్యార్థులకు సౌకర్యాలు ఉండవని పేర్కొన్నారు. అనంతరం సాంఘిక సంక్షేమ వసతి గృహా న్ని పరిశీలించారు. వసతి గృహానికి ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వార్డెన్ తెలిపారు. వసతి గృహాలలోని ఆహార పదార్థాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం పంపిణీ చేయాలని ఆమె ఆదేశించారు. సర్పంచ్ పల్లవి, ఉపసర్పంచ్ చంద్రశేఖరరెడ్డి, ఈఓఆర్డీ సులోచన, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు, సీపీఎం నాయకుల మధ్య ఉద్రిక్తత

నందికొట్కూరు, ఆగస్టు 28: నందికొట్కూరు కౌన్సిల్ సమావేశం వద్ద పోలీసులు, సీపీఎం నాయకుల మధ్య ఉద్రిక్తత చోటు చేసుకుంది. బుధవారం నందికొట్కూరు కౌన్సిల్ సమావేశం జరుగుతున్న సమయంలో సీపీఎం నాయకులు స్థానిక సమస్యలపై వినతిపత్రం సమర్పించేందుకు అక్కడి వచ్చారు. సమావేశ అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇప్పిస్తామని డీఎస్పీ రామాంజి నాయక్ చెప్పడంతో సీపీఎం నాయకులు వేచి చూశారు. సమావేశం ముగిశాక ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వెళ్తున్న క్రమంలో వినతిపత్రం ఇప్పించలేదంటూ పోలీసులపై సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సమస్య తీవ్రతరం అవుతుందన్న నేపథ్యంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అన్న క్యాంటీన్ పనుల పరిశీలన

నందికొట్కూరు, ఆగస్టు 28: నందికొట్కూరు పట్టణంలో అన్న క్యాంటీన్ పనులను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పరిశీలించారు. బుధవారం కౌన్సిల్ సమావేశం అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న అన్నా క్యాంటిన్ పునఃప్రారంభించేందుకు జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. మున్సిపల్ డీఈ నాయబ్ రసూల్ మాట్లాడుతూ అన్నా క్యాంటిన్ పునర్నిర్మాణానికి రూ.23.70 లక్షలను ప్రభుత్వం కేటాయించిందని అందుకు సంబంధించిన పనులను చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ అన్నా క్యాంటిన్ భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆమె సూచించారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు చాంద్‌బాషా, రాధిక, రూపాదేవి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కాకరవాడ చిన్నవెంకటస్వామి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

నందికొట్కూరు, ఆగస్టు 28: అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలో ఏఐటీయూసీ కార్యాలయం నుంచి బయలుదేరి నందికొట్కూరు పట్టణంలోని పురవీధుల్లో కరపత్రాల పంపిణీ చేశారు. సెప్టెంబరు 1, 2, 3వ తేదీల్లో విశాఖపట్నంలో జరుగు ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రఘురామ్మూర్తి మాట్లాడుతూ లోడింగ్, అన్‌లోడింగ్ పనులు, కాల్ గ్యాస్ డెలివరీ చేసే అసంఘటితరంగ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్పిటల్స్, మెడికల్ కాలేజీ, జేఎన్‌టీయూ, మున్సిపల్ క్లాప్ డ్రైవర్లుగా ఎలాంటి భద్రత లేకుండా బానిసలుగా పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీనివాసులు, ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా నాయకులు శేఖర్ నాయుడు, ఏఐటీయూసీ పట్టణ నాయకులు శంకర్ నాయుడు, రాము, రామకృష్ణ, ఉస్మాన్ బాషా, నాగస్వాములు, మున్నా పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 28: నంద్యాల రామక్రిష్ణా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బుధవారం గణేశ్ కేంద్ర సమితి ఆధ్వర్యంలోఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కరపత్రాలు, రసీదుపుస్తకాలు, పరిచయ పత్రాలు, కండువాలు, జెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

మహానంది, ఆగస్టు 28: మహానంది ఆలయంలో భక్తుల కోసం నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి నంద్యాలకు చెందిన మల్లికార్జున రూ. 20 వేలు విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు తెలిపారు. బుధవారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో విరాళం ఇచ్చిన దాతను ఏఈవో శాలువాతో సన్మానించి, అన్నదానం బాండుతో పాటు ప్రసాదాలు అందజేశారు.

'నాణ్యమైన ఆహారం అందించాలి'



కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గడివేముల, ఆగస్టు 28: విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంఈవో విమల వసుంధరాదేవి, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల వంట ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కేజీబీవీలో బుధవారం వారు మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వండించక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పాఠశాలలోని సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గురునాథం, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గిరిజనుల సంక్షేమానికి కృషి'

పాణ్యం, ఆగస్టు 28: ప్రధాన మంత్రి జన్‌మన్ ద్వారా గిరిజనుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు. బుధవారం స్థానిక ఇందిరానగర్‌లోని చెంచులకు పీఎం జన్‌మన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గిరిజన సంక్షేమమే ధ్యేయంగా జన్‌మన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అందరికీ పక్కా ఇళ్లు, ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి, రహదారుల నిర్మాణం, విద్యుత్, నాణ్యమైన విద్య, నైపుణ్య వికాసం, అందరికీ ఆరోగ్యం, పౌష్టికాహారం, జీవనోపాదుల మెరుగుదల, ప్రసార సాధనాల సౌకర్యాలను మెరుగుపరిచే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ పల్లవి, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, సచివాలయ సిబ్బంది, చెంచులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలంటే ప్రతి గిరిజన కుటుంబానికి ఆధార్ కార్డు తప్పనిసరి ఉండాలని ఎంపీడీవో మేరీ సూచించారు. బుధవారం ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎర్రమటం చెంచుగూడెంలో ఎంపీడీవో మేరీ స్థానిక పంచాయతీ కార్యదర్శి పార్థసారథి, ఐటీడీఏ అధికారులతో కలిసి చెంచులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.

శ్రీశైల దేవస్థానంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలం, ఆగస్టు 28: శ్రీశైలం దేవస్థానంలో ఎనిమిది మంది ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఏఈవో స్వాములుకి లడ్డూ విక్రయ కేంద్రాల పర్యవేక్షణ, పెట్రోల్, గ్యాస్ గోడౌన్ బాధ్యతలు, పర్యవేక్షకులు జి. రవికి ధర్మప్రచారం, వైద్యశాల, శివసేవకుల విధుల పర్యవేక్షణ కేటాయించారు. వీరితో పాటు ఇటీవల కారుణ్య నియామకం కింద విధుల్లోనికి చేరిన ఎం. రాజకిశోర్‌కు రికార్డు రూమ్, మైక్ అనౌన్స్‌మెంట్ బాధ్యతలను కేటాయించారు.

'మంత్రిపై ఆరోపణలు సరికాదు'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 28: మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌పై తప్పుడు రాతలు రాయడం సరైన పద్ధతి కాదని నంద్యాల టీడీపీ సీనియర్ నాయకుడు 19వ వార్డు ఇన్‌చార్జి షేక్‌మున్నా అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి భూ కబ్జాకు మంత్రి పాల్పడుతున్నారని తప్పుడు ఆరోపణలు చేయడం వాస్తవాలను గ్రహించకుండా నిందలు వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో నంద్యాల అభివృద్ధికి ప్రభుత్వ విద్యా సంస్థలకు తదితర వాటికి తన భూమినే మంత్రి ఫరూక్ దానం చేశారని గుర్తు చేశారు.నాయకులు జనార్దన్‌గౌడ్, వడ్డె జనార్దన్, ఖాజా, శంకర్, సుబ్రహ్మణ్యం, విద్యా కమిటీ చైర్మన్ మాబాషా, బూత్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరనారాయణ స్వామి గ్రామోత్సవం

పాణ్యం, ఆగస్టు 28: గోకులాష్టమి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం దేవాదాయ శాఖ ఆదర్వంలో వీరనారాయణస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాల ను గ్రామంలోని పురవీధుల గుండా వేదపండితుల మంత్రోచ్ఛరణలతో మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సువర్ణ, సిబ్బంది తిరుమలయ్య, మద్దిలేటి, గ్రామస్థులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

శ్రీకృష్ణుడికి గ్రామోత్సవం



అవుకు, హుసేనాపురంలో కృష్ణుడికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అవుకు, ఆగస్టు 28: అవుకు పట్టణంలో కృష్ణాష్టమిని పురస్కరించుకొని భక్తులు గ్రామోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుడికి మూడు రోజులపాటు పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణుడు ప్రతిమను పల్లకిలో అలంకరించి వీధుల గుండా ఊరేగించారు.

ప్యాపిలి: మండలంలోని హుసేనాపురం గ్రామంలో బుధవారం శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ, మీర్జాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ మండపాల్లో ఏర్పాటు చేసిన కృష్ణుడికి పూజలు కొనసాగుతున్నాయి. ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, గీతా ప్రవచనాలు, ఆధ్యాత్మిక బోధనలు చేపడుతున్నారు. సెప్టెంబరు-2న మీర్జాపురంలో, 4న కొలిమిగుండ్లలో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరుణ యాగం



వరుణ యాగం చేస్తున్న ఎరువుల డీలర్లు

చాగలమర్రి, ఆగస్టు 28: చాగలమర్రిలోని బుగ్గ మల్లేశ్వర ఆలయంలో బుధవారం ఎరువులు, పురుగు మందుల డీలర్ల సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వరుణ యాగం చేశారు. వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో నవగ్రహ, గణపతి హోమం, 108 బిందెలతో జలా భిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలను దంపతులతో నిర్వహించారు. ఈశ్వరస్వామికి జల, క్షీరాభిషేకాలు చేశారు. వరుణ దేవుడి కోసం శివపా ర్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఏడీఏలు యోగిరెడ్డి, రామ్మోహ న్‌రెడ్డి, ఏవో రంగసేతాజీ, వ్యవసాయ సిబ్బంది, ఎరువులు, పురుగు మందుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'ఏటీఎంల వద్ద భద్రత కల్పించాలి'



బ్యాంకు అధికారులకు సూచనలిస్తున్న సీఐ వంశీధర్

శిరివెళ్ల, ఆగస్టు 28: మండలంలోని ఏటీఎం కేంద్రాల వద్ద తప్పనిసరిగా భద్రత ఏర్పాటు చేయాలని సీఐ వంశీధర్ సూచించారు. మండలంలోని వివిధ బ్యాంకులకు చెందిన అధికారులతో శిరివెళ్లలోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఏటీఎం కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్న పీరయ్య పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి: ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, ఆగస్టు 28: ప్రజలు తనను ఓడించారన్న కక్షతో రాష్ట్ర ఇమేజ్‌ని దెబ్బతీయడానికి జగన్ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే అఖిలప్రియ బుధవారం కోరారు. టీడీపీ యాప్ ద్వారా పార్టీ కంటెంట్‌ను ప్రజలకు వివరించి టాప్ పర్ఫార్మెన్స్‌గా నిలిచిన దస్తగిరి, విజయబాస్కర్‌రెడ్డి, సిద్దం వెంకటకృష్ణారెడ్డి, నాగూరు చిన్నపుల్లయ్యకు నారా లోకేశ్ పంపిన ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, ఆగస్టు 28: మండలంలోని బందార్లపల్లె చెక్‌పోస్టు వద్ద నివసించే బొంగురు తేజ(35) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాలివి.. బొంగురు తేజ కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 19న ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా, కోలుకోలేక మృతి చెందాడని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

రుద్రవరం, ఆగస్టు 28: రుద్రవరం మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేసినట్లు ఏపీవో ప్రతాప్ బుధవారం తెలిపారు. పెద్దకంబలూరు, ముత్తలూరు, పేరూరు, రుద్రవరం, చిన్నకంబలూరు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న వారు రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. రాజీనామా ప్రతులను ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు తెలిపారు.

నేడు బహిరంగ చర్చా వేదిక

రుద్రవరం, ఆగస్టు 28: రుద్రవరం మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ చర్చ వేదికను గురువారం నిర్వహిస్తున్నట్లు బుధవారం ఏపీవో ప్రతాప్ తెలిపారు. ఈ చర్చ వేదిక ఉపాధి హామీ కార్యాలయం ఆవరణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు చర్చ వేదిక ప్రారంభమవుతుందని చెప్పారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు: ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, ఆగస్టు 28: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ ఆర్టీసీ బస్టాండులో బుధవారం మూడు నూతన బస్సు సర్వీసులను ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్టాండులో మరుగుదొడ్లు, తాగునీరు వంటి కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో ఒక్క నూతన ఆర్టీసీ బస్సును ప్రారంభించలేదని, ముఖ్యంగా బస్టాండులో ప్రయాణికుల కోసం నిర్మించిన మరుగుదొడ్ల ప్రారంభానికి నోచుకోలేదని అన్నారు. ఆర్టీసీ డ్రైవర్లను వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసిందని విమర్శించారు. గతంలో ఆర్టీసీ అధికారులతో నిర్వహించిన సమావేశాల్లో బస్సు సర్వీసులు తక్కువ ఉన్నాయని చెప్పానని, ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ఆర్టీసీ అధికారులతో మాట్లాడి నూతన బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిపో మేనేజర్ రాజశేఖరరెడ్డి, టీడీపీ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి చేయాలి'

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ మండల టీడీపీ కన్వీనర్‌గా ఎంపికైన హరికుమార్‌రెడ్డి ఎమ్మెల్యే అఖిలప్రియను బుధవారం పట్టణంలోని ఆమె నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణారెడ్డి, ఓబులంపల్లె సొసైటి మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.



నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

యాగంటిలో వేలం పాటలు

బనగానపల్లె, ఆగస్టు 28: యాగంటి క్షేత్రంలో బుధవారం ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. బొమ్మలు, పండ్లు అమ్ముకునేందుకు మీరాపురానికి చెందిన బీ.గోపాల్‌రెడ్డి రూ.6.55 లక్షలకు పాట పాడి వేలాన్ని దక్కించుకున్నారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది రూ.15వేలు అధికంగా ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. ఐస్ క్రీం అమ్ముకునే హక్కును పాతపాడుకు చెందిన మధుసూదన్ రూ. 4.70 లక్షల వేలం పాట పాడి దక్కించుకున్నారు. గత సంవత్సరం కంటే రూ.2.20 లక్షల ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కుకు సంబంధించి డిపాజిట్లు చెల్లించడానికి ఎవ్వరూ ముందుకు రానందున వేలం పాటలను వాయిదావేసినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇనెస్పెక్టర్ చక్రభరత్, మౌళీశ్వరరెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

'అడవులను కాపాడుకుందాం'

రుద్రవరం, ఆగస్టు 28: అడవులను కాపాడుకుందామని సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రుద్రవరం సబ్ డీఎఫ్‌వో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రుద్రవరం, చెలిమ రేంజ్‌ల పరిధిలో అటవీ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులు వన్యప్రాణులకు హాని తలపెట్టకుండా చూడాలన్నారు. పంటలకు నష్టం జరిగితే అధికారుల దృష్టికి తీసుకువస్తే నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్ర వాహనాలు వేలం: రుద్రవరంలోని ఫారెస్టు కార్యాలయంలో బుధవారం ఎర్రచందనం కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం నిర్వహించినట్లు సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మూడు ద్విచక్ర వాహనాలు వేలం వేయగా రూ.20,150 ఆదాయం వచ్చిందని తెలిపారు. రేంజర్ శ్రీపతి నాయుడు, డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు ముక్తర్‌బాషా, శ్రీనివాసరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



వేలాలను పరిశీలిస్తున్న సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి

మంత్రి బీసీని కలిసిన మందకృష్ణ మాదిగ



మంత్రి బీసీతో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

బనగానపల్లె, ఆగస్టు 28: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని విజయవాడలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, మద్దిపాటి వెంకటరాజు, పలువురు దళిత నేతలు మంత్రిని కలుసుకున్నారు. బీసీకి మంత్రి పదవి రావడం పట్ల వారు అభినందించారు. ఈసందర్భంగా పలు అంశాలపై వారు మంత్రితో చర్చించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న వాల్మీకి నాయకులు

డోన్(రూరల్), ఆగస్టు 28: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏపీ వాల్మీకి సమితి జిల్లా నాయకుడు నల్లబోతుల సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘం నాయకులతో కలిసి డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా నల్లబోతుల సురేష్ మాట్లాడుతూ వాల్మీకులు వెనుకబడి పేదరికంలో మగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలమద్దిలేటి, శ్రీధర్, శ్రీనాథ్, రాజు, రాజశేఖర్, చౌడేష్, కంబగిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

'చెంచులు ఆర్థికంగా ఎదగాలి'

చాగలమర్రి, ఆగస్టు 28: చెంచులు జీవనోపాధులను పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని ఈవోఆర్డీ తాహిర్‌హుస్సేన్ సూచించారు. మండలంలోని డి.వనిపెంట చెంచుగూడెంలో బుధవారం పీఎం జన్‌మన్ కార్యక్రమంపై చెంచులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చెంచులు విద్య, వైద్యం, పౌష్టికాహారం, జీవనాభివృద్ధి, రహదారులు, పక్కా గృహాలు, ఉపాధి హామీపై అవగాహన కల్పించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలీశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు గోపాల్, ఎంపీడీవో మహబూబ్‌దౌల, ఎంఈవో అనూరాధ, ఏపీవో నిర్మల, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యపై అవగాహన ర్యాలీ

చాగలమర్రి, ఆగస్టు 28: చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాల, బాలబాలికలు, ఉపాధ్యాయులు, ఎంఈవోలు కలిసి బుధవారం ఏపీ సార్వత్రిక విద్యపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల ఆధ్వర్యంలో పురవీధుల గుండా ర్యాలీ చేశారు. ఎంఈవోలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సార్వత్రిక విద్యపై ప్రత్యేక దృష్టి ఉంచిందని అన్నారు. బడిమానివేసిన విద్యార్థుల కోసం సార్వత్రిక విద్య ద్వార ఉత్తీర్ణత సాధించవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు రవింద్రారెడ్డి, పీడీ దాదాపీర్, సీఆర్పీ అమీర్‌ఖాన్, మల్లికార్జున, వలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పంట నమోదు

బేతంచెర్ల, ఆగస్టు 28: మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు ఖరీఫ్-2024 సంబంధించిన పంట నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు 20వేల ఎకరాల పంట నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇంకా 14వేల ఎకరాల పంట నమోదు జరగాల్సి ఉందని, సెప్టెంబరు 15 కల్లా మిగిలిన పంట నమోదు పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో మహ్మద్, సెరికల్చర్ అసిస్టెంట్ రాజేశ్వరి, అగ్రికల్చర్ అసిస్టెంట్ రవితేజ, స్వాతి, రైతులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రుద్రవరం, ఆగస్టు 28: మండలంలోని ఆలమూరు గ్రామ సమీపంలోని మొక్కజొన్న పంట పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో బుధవారం దాడి చేసినట్లు ఎస్ఐ వర ప్రసాద్ తెలిపారు. ఈ దాడిలో నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశామని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.41,240 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆరు సెల్‌ఫోన్లు, 8 మోటారుసైకిళ్లు సీజ్ చేశామన్నారు. మరో ఐదుగురు పారిపోయారని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

మద్దిలేటి స్వామి హుండీ ఆదాయం రూ.18.26 లక్షలు



హుండీ నగదును లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది

బేతంచెర్ల, ఆగస్టు 28: ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులోని మద్దిలేటి నరసింహస్వామి, మహాలక్ష్మి అమ్మవార్ల హుండీల్లో రూ.18.26 లక్షల ఆదాయం లభించినట్లు ఉప కమిషనర్ ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. బుధవారం జిల్లా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో 29 రోజులకు సంబంధించిన స్వామి, అమ్మవార్ల హుండీ లెక్కింపును నిర్వహించారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.15,53,023 నగదు, 20 గ్రాముల బంగారం, 94 గ్రాముల వెండి, భక్తుల కానుకల ద్వారా లభించినట్లు తెలిపారు. అలాగే మహాలక్ష్మి అమ్మవారి హుండీ ఆదాయం రూ.2,73,348 నగదు లభించినట్లు తెలిపారు.

పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

బేతంచెర్ల, ఆగస్టు 28: రాష్ట్ర ప్రభుత్వం పాస్టర్లకు గౌరవ వేతనం అందించాలని మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు, రాష్ట్ర కార్యదర్శి మేకల నాగరాజు, టీడీపీ ఎస్సీ సెల్ నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి రూబెన్ వినతి పత్రం అందజేశారు. మంగళవారం మంగళగిరిలో టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి ఫరూక్‌ను కలిసి వినతి పత్రం అందజేశామని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రెండో తేదీ రివ్యూ మీటింగ్ ఉందని, నిధులు విడుదల చేస్తామని చెప్పారన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

డోన్(రూరల్), ఆగస్టు 28: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ సూచించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు పంట నమోదు చేసుకునేలా ప్రజాప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఉద్యానశాఖ అధికారి జి.కళ్యాణి, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ ఏఈలు సతీష్, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

రుద్రవరం, ఆగస్టు 28: కలెక్టరు రాజకుమారి ఆదేశాల మేరకు తహసీల్దారు కార్యాలయంలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు మల్లికార్జునరావు బుధవారం అన్నారు. సీసీ కెమెరాల నిఘాలో తహసీల్దారు కార్యాలయాన్ని ఉంటుందన్నారు. ప్రత్యేకంగా రికార్డు రూముకు ఏర్పాటు చేశామన్నారు. కార్యాలయానికి ఎవరు వచ్చారు? ఎవరు వెళ్లారు? అన్నది ప్రతీది సీసీ కెమెరాల్లో రికార్డు అవుతుందని చెప్పారు. రెవెన్యూ రికార్డును సక్రమంగా ఫైల్ చేసి ప్రత్యేకంగా గదిలో భద్రపరుస్తున్నామన్నారు. డిప్యూటీ తహసీల్దార్లు, డీఆర్వోలు పాల్గొన్నారు.

'చెంచుగూడేల అభివృద్ధే లక్ష్యం'

రుద్రవరం, ఆగస్టు 28: చెంచుగూడేల అభివృద్ధే లక్ష్యమని, చెంచుగూడెల్లో ప్రధానమంత్రి జన్‌మన్ జనజాతి ఆదివాసీ న్యాయం మహా అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదనరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నాయస్వామి చెంచు గూడెం, హరినగరం చెంచు గూడెంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో పీఎం జన్‌మన్ పథకం సంబంధించి అందరికీ పక్కా ఇళ్లు, ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి, రహదారుల నిర్మాణం చేపడతామన్నారు. నాణ్యమైన విద్య, ప్రతి ఇంటికీ విద్యుత్ కనెక్షన్, ఆరోగ్య జీవన సదుపాయాలు చేకూర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రతి ఇంట్లో వంట గ్యాస్ ఆయుష్మాన్ భారత్ అందరికీ ఆధార్ కార్డులు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈలు ప్రమోద్, వెంకటరాముడు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మి, కార్యదర్శులు షాహినూర్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 28: కొలిమిగుండ్లలోని నాయీబాహ్మణ కాలనీలో నూతనంగా నిర్మించిన త్యాగరాజ, కోదండరామ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. నాయీ బ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మట్కా, గంజాయిపై ఉక్కుపాదం: డీఐజీ



డోన్‌లో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ

డోన్, ఆగస్టు 28: ఉమ్మడి కర్నూలు జిల్లాలో మట్కా, గంజాయిలపై ఉక్కుపాదం మోపుతామని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ అన్నారు. బుధవారం డోన్ డీఎస్పీ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ అధిరా జ్‌సింగ్ రాణాతో కలిసి డీఐజీ తనిఖీ చేశారు. అంతకుముందు వారు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. డోన్ సబ్ డివిజన్‌లో కేసుల వివరాలను డీఎస్పీ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐజీ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ డోన్ సబ్ డివిజన్‌లో మట్కా, పేకాట, గంజాయి, అక్రమ మద్యం వంటి అసాంఘిక కార్యకలా పాలు లేకుండా చేస్తామన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌కు బుధవారం డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అధిరాజ్ సింగ్‌లు తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలోని శాంతి భద్రతలపై పోలీస్ అధికారులతో చర్చించారు. రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఆదేశించారు. దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో శాంతిభద్రతలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, బనగానపల్లె, డోన్ సీఐలు మంజునాథ్‌రెడ్డి, కృష్ణయ్యయాదవ్, రాకేశ్ పాల్గొన్నారు.

చాగలమర్రి: కర్నూలు రేంజి పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు ప్రత్యేక నిఘా ఉందని డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. బుధవారం సాయంత్రం చాగలమర్రి పోలీసు స్టేషన్‌ను ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాతో కలిసి సందర్శించారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. నేరాల గురించి అడిగి తెలుసుకున్నారు.ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు, ఎస్ఐలు రమేష్‌రెడ్డి, హరిప్రసాద్, ఏఎస్ఐ నబీసాహెబ్, పోలీసులు ఉన్నారు

యువత స్వశక్తితో ఎదగాలి: బీసీ ఇందిరమ్మ



శ్రీనిధి హోటల్‌ను ప్రారంభిస్తున్న బీసీ ఇందిరమ్మ

కోవెలకుంట్ల, ఆగస్టు 28: యువత స్వశక్తితో ఎదగాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీనిధి రెస్టారెంట్ ఫ్యామిలీ గార్డెన్ హోటల్‌ను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో యువత అభివృద్ధికి పెద్దపీట వేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు యువత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు, శ్రీనిధి హోటల్ యజమాని మద్దిలేటి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, యువ నాయకులు కాటరెడ్డి మల్లిఖార్జునరెడ్డి, కోవెలకుంట్ల మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంటు గువ్వల సుబ్బారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు మద్దిలేటి, సౌదరిదిన్నె సుబ్బారెడ్డి, వెలగటూరు ధనుంజయుడు, గడ్డం అమర్ నాథరెడ్డి, పెనుగొండ శేఖర్, బిజినవేముల హుసేఉనయ్య, వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, లింగాల నాయుడు, మురళి, కేవీ సుబ్బారెడ్డి, గుండయ్య, కుళాయి పాల్గొన్నారు.

గోవుకు ఘనంగా అంత్యక్రియలు



మృతి చెందిన గోవు వద్ద రైతు రాజేంద్ర

ప్యాపిలి, ఆగస్టు 28: మండలంలోని చిన్నపూదిళ్ల గ్రామంలో బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన గోవుకు యజమాని రాజేంద్ర మేళతాళలతో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. దాదాపు 20ఏళ్ల వయస్సు ఉన్న గోవు 14 ఈతలు ఈనిందని, తద్వారా ఇంట్లో పశుసంపద పెరిగిందని యజమాని తెలిపారు.

'విద్యాభివృద్ధికి కృషి చేయాలి'

చాగలమర్రి, ఆగస్టు 28: చాగలమర్రి కేజీబీవీలో చదువుతున్న గిరిజన బాలికల విద్యాభివృద్ధికి కృషి చేయాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో మహబూబ్‌దౌలా సూచించారు. బుధవారం మండలస్థాయి అధికారులు తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులు, పాఠశాల పరిసరాలు పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని, మరుగుదొడ్లు, స్నానపు గదులను పరిశీలించారు. పాఠశాల ప్రహరీ వివాదస్పదంగా ఉందని, సమస్యలు పరిష్కరించి రక్షణ గేటు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌వో సునీత తహసీల్దార్, ఎంపీడీవోను దృష్టికి తీసుకొచ్చారు. ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, ఏవో రాజేంద్రప్రసాదు ఉన్నారు.

మోడల్ స్కూల్, హాస్టల్ తనిఖీ

బేతంచెర్ల, ఆగస్టు 28: మండలంలోని గోరుమానుకొండ గ్రామ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌ను తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఈవీఆర్‌వో రంగనాయకులు బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌ను తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం, మెరుగైన విద్య అందించేలా చూడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన

ఉయ్యాలవాడ, ఆగస్టు 28: నర్సిపల్లె గ్రామ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని ఉయ్యాలవాడ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి అపర్ణ సూచించారు. ఆమె మాట్లాడుతూ భోజనానికి ముందు చేతులు సబ్బుతో ఎలా కడుగుకోవాలో విద్యార్థులకు వివరించారు. ఎత్తు, బరువులు తక్కువగా ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి మందులు పంపిణీ చేశారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. హెచ్ఎం శివారెడ్డి, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

'అధిక ధరకు విక్రయిస్తే చర్యలు'

ఉయ్యాలవాడ, ఆగస్టు 28: వ్యవసాయ ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి రాజేంద్రకుమార్ హెచ్చరించారు. బుధవారం పెద్దయమ్మనూరు గ్రామ వ్యవసాయ సొసైటీని సందర్శించి ఎరువులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే అమ్మాలన్నారు. అన్ని ట్యాక్సులతో కలిపి ప్రభుత్వ ధర డీఏపీ ఎరువు బస్తా రూ. 1350, యూరియా రూ. 267, 20 20 0 13 రూ. 1140కు అమ్మాలన్నారు. ఈ ధరల కన్నా అధిక ధరలకు అమ్మితే రైతులు తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎరువులకు సంబంధించిన బిల్లులు కచ్చింగా తీసుకోవాలన్నారు.

పంట నమోదుకు రైతులు సహకరించాలి

కొలిమిగుండ్ల, ఆగస్టు 28: పంట నమోదుకు రైతులు సహకరించాలని మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి అన్నారు. మెట్ట పంటలతో పాటు ఉద్యానవన పంటలు, అందులో సాగు చేసిన అంతర్ పంటలను తప్పక అన్‌లైన్‌లో పంట నమోదు చేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు.

'పశు వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, ఆగస్టు 28: పశువుల వ్యాధులతో రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి దీపకుమారి సూచించారు. నగల్లపాడు, కలుగొట్లపల్లె గ్రామాల్లో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. రైతులు తమ పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు.